క్లుప్తంగా

మాదారం ఎస్సైగా రాజశేఖర్



తాండూర్: మండలంలోని మాదారం ఎస్సైగా జి.రాజశేఖర్ నియామకం కాగా మంగళవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్సైగా పని చేసిన హేమ, రామగుండం పోలీసు కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో తాళ్లగురిజాల ఎస్సైగా పనిచేసిన రాజశేఖర్‌ను మాదారం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. కొత్తగా విధుల్లో చేరిన ఎస్సైకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రేపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. 2019 నుంచి 2022 మధ్య డిగ్రీలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇందులో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ మెమోల జిరాక్స్‌లు, ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌ఫొటో, బయోడేటాతో హాజరు కావాలన్నారు. విప్రో, హెచ్‌డీఎఫ్‌సీ, మహీంద్ర, ముతూట్ ఫైనాన్స్, బీపీవో, ఆక్సిస్ బ్యాంకు లాంటి కంపెనీలు రిక్రూట్‌మెంట్ చేసుకుంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ లింక్ ద్వారా రిజిస్టర్ చేసుకొని పాల్గొనాల్సిందిగా పేర్కొన్నారు.

సినీ గేయ రచయిత బాపు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న సర్పంచులు

తాండూర్: మండలంలోని మాదారంకు చెందిన సినీ గేయరచయిత, నిర్మాత, జాతీయ కళారత్న తైదల బాపు జన్మదిన వేడుకలను మాదారం టౌన్‌షిప్‌లో బాపు యువసేన ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురు సర్పంచులు కేక్ కట్ చేశారు. మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకు ద్వారా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి 30యూనిట్ల రక్తం సేకరించారు. తాండూర్ సర్పంచ్ నవీన్‌కుమార్‌తో పాటు ఇతర యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సాగరిక, అభినవ సంతోష్, తైదల శ్రీనివాస్, మంగీలాల్, సుభాష్, అమిద్, భరత్, బోడ సతీష్, రాజమణి, భీమన్న, తిరుపతి, తలసేమియా సొసైటీ సభ్యులు శ్రీనివాస్, రంజిత్‌కుమార్, బ్లడ్ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ' వార్షికోత్సవం



తాండూర్: మండలంలోని మాదారం–2 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారుల విషయ పరిజ్ఞానాన్ని పరీక్షించి, అసెస్మెంట్ కార్డులను అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న పథకాల గురించి చిన్నారులు, తల్లిదండ్రులకు మరోసారి వివరించి అవగాహన కల్పించారు. పిల్లల బరువు, ఎత్తు, జబ్బా కొలతలు తీసి తల్లిదండ్రులకు పిల్లలు ఏ గ్రేడ్‌లో ఉన్నారో వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సువర్ణ, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ అందజేత



నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలో వివిధ గనుల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల పిల్లలకు వారి పై చదువుల కోసం ఏరియా జీఎం సంజీవరెడ్డి స్కాలర్‌షిప్ చెక్కులను మంగళవారం అందజేశారు. తిరుపతి ఐఐటీలో సివిల్ ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న నిఖిల్ శ్రీకృష్ణ తండ్రి రాధాకృష్ణకి రూ.1,10,100 చెక్కును, హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్న ఆవుల ఆకాంక్ష తండ్రి ఆవుల కొమురయ్యకు రూ.10వేల చెక్కును జీఎం సంజీవరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం త్యాగరాజు, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం సివిల్ శివరావు, అధికారులు శ్రీధర్, చంద్రశేఖర్‌రెడ్డి, మురళీమోహన్, రాజేశ్వర్‌రావు, కాంతారావు, ప్రకాశ్‌రావు, పీవీ రావు, తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు కరెంట్ కష్టం..!

- సింగరేణి కట్ చేసింది.. సర్కార్ ఇవ్వనంటోంది
- 14 వ్యాపార సముదాయాలకు నిలిచిన కరెంటు
- 42 రోజులుగా వ్యాపారాలు బంద్



కరెంట్ కనెక్షన్ లేక సాయిబాబా ఆలయం ముందున్న షాపులు

మందమర్రిరూరల్: పట్టణంలోని సింగరేణి హైస్కూల్ గోడను ఆనుకుని సుమారు 30 సంవత్సరాల నుంచి 14 కుటుంబాలు చిన్న వ్యాపార దుకాణాల సముదాయాలు నిర్వహించుకుంటున్నారు. ఆనాడు ఈ సముదాయానికి సింగరేణి సంస్థ కరెంట్ మీటర్ అమర్చగా కూల్‌డ్రింక్, పాన్‌షాపు, టైర్ పంచర్ షాప్, మెకానిక్ షెడ్, హోటల్ తదితర షాపులు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. ఇంతలోనే వారి దుకాణాల సముదాయం మీదుగా హై వోల్టేజీ కరెంట్ సరఫరా లైన్ వేయడంతో, పాతలైన్ తొలగించారు. హై వోల్టేజ్ లైన్‌కు మీటర్లు అమర్చడం కుదరదని, మీటర్లను తొలగించాల్సి ఉంటుందని, పది రోజుల్లో ప్రభుత్వ కరెంట్ కనెక్షన్ ఏర్పాటు చేసుకోవాలని నోటీసులిచ్చిన అనంతరం సింగరేణి అధికారులు ఆ షాపులన్నింటికీ కరెంట్ కనెక్షన్లు తొలగించింది. ఈ విషయాన్ని మార్కెట్ వ్యాపార కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌తో కలిసి ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకెళ్లామని, ఇప్పటివరకూ ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం కనెక్షన్ కరెంట్ రాక, ఇటు సింగరేణి కరెంట్ కనెక్షన్ తొలగించబడి షాపుల నిర్వాహకులు అష్టకష్టాలు పడుతున్నారు. షాపులు నడవక జీవనోపాధికి ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

మీటర్లు అమర్చాలి

30సంవత్సరాలుగా పాన్‌షాపు నిర్వహిస్తున్నాను. 42రోజుల క్రితం మా షాపులపై నుంచి హై వోల్టేజ్ విద్యుత్ వైర్లు పోయాయని నోటీసులిచ్చి, కరెంట్ మీటర్ తొలగించారు. ఈ విషయాన్ని ప్రభుత్వ విప్ సుమన్ దృష్టికి తీసుకెళ్లాం. అధికారులు సాకులు చెబుతున్నారు తప్పా, కరెంట్ కనెక్షన్ ఇవ్వడం లేదు. మా జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని కరెంట్ మీటర్లు అమర్చాలి.

– కాసిపేట స్వామి, పాన్‌షాపు నిర్వాహకుడు

పోల్స్ అందుబాటులో లేవు

సింగరేణి సంస్థ ఇది వరకు కనెక్షన్ ఇచ్చిన షాపులకు ప్రభుత్వ విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి పోల్స్ అందుబాటులో లేవు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. షాపుల ముందు ఉన్నటువంటి రోడ్డు మధ్యలో పబ్లిక్ విద్యుత్ స్తంభాలు అమర్చాం. సింగరేణి స్ట్రీట్ లైట్స్ అక్కడ అవసరం లేదు. ఆ స్తంభాలను ప్రభుత్వ విద్యుత్ శాఖకి అప్పగిస్తే షాపులకు విద్యుత్ మీటర్లు అమర్చుతాం.

– మల్లేషం, విద్యుత్ శాఖ ఏఈఈ

గంగారంలో బోరుబావుల ఏర్పాటు



బోరుబావులు ప్రారంభిస్తున్న వివేక్ వెంకటస్వామి

చెన్నూర్‌రూరల్: మండలంలోని సోమనపల్లిలో మంగళవారం బీజేపీ జెండా కార్యక్రమం నిర్వహించగా మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి హాజరై బీజేపీ జెండా ఆవిష్కరించారు. అనంతరం నాగాపూర్, గంగారం గ్రామాల్లో వెంకటస్వామి ఫౌండేషన్ ద్వారా మూడు బోరుబావులను ఉచితంగా ఏర్పాటు చేయించి ప్రారంభించారు. ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను తీర్చేందుకు బోరు బావులు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా కార్యదర్శి అందుగుల శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు గొట్టిముక్కుల సురేష్, పార్లమెంట్ కన్వీనర్ మల్లిఖార్జున్, జాయింట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, శ్రీధర్ పటేల్, చెన్నూర్ మండల అధ్యక్షుడు ఆలం బాపు, చెన్నూర్ పట్టణ అధ్యక్షుడు సుశీల్‌కుమార్, భీమారం మండల అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి



నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

పాతమంచిర్యాల: హైందవ ధర్మానికి జీవం పోసిన మహానీయుడు జగద్గురు ఆదిశంకరాచార్యులు అని జిల్లా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు మడుపు రాంప్రకాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జగదాంబ కాంప్లెక్స్‌లో మంగళవారం జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగద్గురు ఆదిశంకరాచార్యుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం పట్టణ అధ్యక్షుడు మట్టెల రమేష్, ప్రధాన కార్యదర్శి రామోజు రాజేశ్వర్, గౌరవ అధ్యక్షుడు కోటోజు రమేష్, కార్పెంటర్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రాజయ్య, నాయకులు అక్కెనపల్లి మధు, అందే శ్రావణ్, లక్కాపురం సంతోష్, చింతల మల్లేష్, పాడిశెట్టి వేనేంద్రాచారి, అనంతరామయ్య, ఎర్రోజు వేణు, కొక్కొండ రమణయ్య, కృష్ణమూర్తి, గుండోజు రమేష్, ముత్తోజు రమేష్, జిల్లా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మసంఘం సభ్యులు, కార్పెంటర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన



లక్సెట్టిపేట: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కోటపల్లిలో..

కోటపల్లి: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాధి నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్ గౌడ్, ఏఎన్ఎం విజయ, పుష్ప, సిబ్బంది రత్నాకర్, శ్రీనివాస్, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని లక్సెట్టిపేట మండలంలోని వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మలేరియా జ్వరాలు, దోమకాటు వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జీ.రామ్మూర్తి, హెచ్ఈవో నాందేవ్, సిబ్బంది శ్రీనివాస్, లక్ష్మణస్వామి, రత్నకుమారి, మార్త, గఫూర్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

కంటివెలుగు సద్వినియోగం చేసుకోండి



సోమగూడెంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

కాసిపేట: గ్రామాల్లో ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని, సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. మండలంలోని సోమగూడెం(కె) గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చంద్రయ్య, సర్పంచ్ సఫాట్ శంకర్, మండల నాయకులు పాల్గొన్నారు.

ముగింపు సభలు విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దళితశక్తి ప్రోగ్రాం, ప్రజాసంఘాల నాయకులు

పాతమంచిర్యాల: దళిత శక్తి ప్రోగ్రాం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ 10వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర ముగింపు సమావేశం ఈ నెల 30న హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో జరుగుతుందని, ఈ మహాసభను విజయవంతం చేయాలని దళితశక్తి ప్రోగ్రాం జిల్లా కన్వీనర్ నందిపాటి రాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం పాదయాత్ర ముగింపు సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు సంగెం లక్ష్మణ్, బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు గుమ్ముల శ్రీనివాస్, జై భారత్ జిల్లా అధ్యక్షుడు సలీం, దళితశక్తి ప్రోగ్రాం జిల్లా నాయకులు జంగపల్లి రామస్వామి, గొడిసెల సురేందర్, రేగుంట రాకేష్ పాల్గొన్నారు.



కాసిపేటలో బతుకమ్మ ఆడుతున్న వీవోఏలు



దండేపల్లిలో వంటావార్పు

వినూత్నంగా వీఓఏల నిరసన



కోటపల్లిలో భిక్షాటన చేస్తున్న వీవోఏలు

కోటపల్లి/కాసిపేట/చెన్నూర్/దండేపల్లి/వేమనపల్లి/నెన్నెల/లక్సెట్టిపేట: ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్నారు. పలు మండల కేంద్రాల్లో మంగళవారం దీక్షలు చేపట్టగా వివిధ పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించారు. కాసిపేటలో బతుకమ్మ ఆడి నిరసన తెలపగా, కోటపల్లిలో భిక్షాటన చేసి, లక్సెట్టిపేటలో కళ్లకు గంతలు కట్టుకుని, దండేపల్లిలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలపై నిర్లక్ష్యం చేస్తూ, నిరసనలపై స్పందించకపోవడం బాధాకరమని, ఆందోళనలు ఉధృతం చేస్తూ సమ్మెకు దిగనున్నట్లు ప్రకటించారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు.



లక్సెట్టిపేట: కళ్లకు గంతలు కట్టుకుని నిరసన



నెన్నెల: మద్దతు తెలుపుతున్న హరీష్‌గౌడ్

ఊరూరా బీఆర్ఎస్ జెండా పండుగ



బెల్లంపల్లి: జెండా ఆవిష్కరిస్తున్న నారాయణ



భీమారంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



దండేపల్లి: వేడుకల్లో ఎంపీపీ, బీఆర్ఎస్ నాయకులు



లక్సెట్టిపేటలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

బెల్లంపల్లి/నెన్నెల/తాండూర్/చెన్నూర్‌రూరల్/కోటపల్లి/వేమనపల్లి/భీమిని/భీమారం/కాసిపేట/బెల్లంపల్లిరూరల్/లక్సెట్టిపేట/దండేపల్లి/జన్నారం: బీఆర్ఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా గులాబీ శ్రేణులు పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జెండా గద్దెల వద్ద గులాబీ తోరణాలతో అలంకరణ చేసి పండుగ వాతావరణంలో జరుపుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పార్టీ జెండాలు ఎగురవేశారు. పలువురు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీతోనే మెరుగైన పాలన సాధ్యమవుతుందన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో బెల్లంపల్లిలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డు నారాయణ, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నూనేటి సత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, బీఆర్ఎస్ మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, నెన్నెలలో ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ శ్యామల, పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేష్, నెన్నెల ఎంపీటీసీ పురంశెట్టి తిరుపతి, తాండూర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు దత్తుమూర్తి, ఎంపీపీ ప్రణయ్‌కుమార్, జెడ్పీటీసీ బానయ్య, ఎంపీటీసీ సిరంగి శంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మహేందర్‌రావు, చెన్నూర్‌రూరల్ మండలంలో ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, రైతుబంధు సమితి మండల కో ఆర్డినేటర్ రత్న సమ్మిరెడ్డి, వేమనపల్లిలో మండల అధ్యక్షుడు వేణుమాదవ్, సర్పంచ్ మధుకర్, భీమినిలో జెడ్పీటీసీ కొటారపు సత్యనారాయణ, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ శ్రీరామరావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఆకుతోట రాజన్న, భీమారంలో మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, కాసిపేటలో మండలాధ్యక్షుడు రమణరెడ్డి, బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లిలో ఎంపీపీ శ్రీనివాస్, దండేపల్లిలో ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

- నెన్నెల మండలంలో సీపీఐ ప్రజాపోరుయాత్ర
- సీపీఐ కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



నెన్నెలలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

నెన్నెల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నిరుపేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరుయాత్ర మంగళవారం నెన్నెల మండలం మైలారం, గొల్లపల్లి, జోగాపూర్, గన్‌పూర్, నందులపల్లి, నెన్నెల మీదుగా జంగాల్‌పేటకు కొనసాగింది. ప్రజలు పూలమాలలు, డప్పుచప్పుళ్లతో నాయకులకు ఆహ్వానం పలికారు. గడపగడపకూ వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీపీఐకి మద్దతిచ్చి ఆదరిస్తే, సమస్యలను పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. యాత్రలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణ్ మాట్లాడుతూ... పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న గిరిజనులకు అటవీ హక్కు చట్టం ప్రకారం క్రమబద్ధీకరించాలన్నారు. సాగులో ఉన్న నిరుపేదలపై దాడులు చేస్తూ, భూముల చుట్టు కందకాలు తవ్వుతున్నారని ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి అర్హులైన వారికి తెల్లరేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం చేపట్టిన ప్రజాపోరు యాత్రకు మంచి స్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో దళ సభ్యులు శ్రీధర్, లక్ష్మీనారాయణ, అక్కపల్లి బాపు, గట్టయ్య, లింగయ్య, శంకర్, స్వామిదాస్, నాయకులు మిట్టపల్లి శ్రీనివాస్, కాదండి సాంబయ్య, రవి, మొండి, చంద్రయ్య పాల్గొన్నారు.

భీమారంలో రక్తదాన శిబిరం



భీమారం: రెడ్‌క్రాస్‌సొసైటీ, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ సంయుక్తంగా కలిసి మంగళవారం భీమారం మండల కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ట్రెసా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రావు హాజరై మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. శిబిరంలో 32మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు చందూరి మహేందర్, తహసీల్దార్ వాసంతి, ఎంపీడీవో శ్రీనివాస్, ఆర్ఐ అరుణతో పాటు పలువురు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: వేసవిలో భాగంగా టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ ట్రెనింగ్ కోర్సులకు 30 వరకు దరఖాస్తుల స్వీకరించనున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. అర్హత కల్గిన విద్యార్థులు ప్రభుత్వ పరీక్షల విభాగం తెలంగాణ వెబ్‌సైట్ ద్వారా htpp//bse.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. హైదరాబాద్, నల్గొండ, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలో మే 1 నుంచి జూన్ 11 వరకు ట్రెనింగ్ ఉంటుందని పూర్తి వివరాలకు ఆయా జిల్లాల డీఈవో కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు.

'డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడం తగదు'

పాతమంచిర్యాల: పాఠ్య పుస్తకాల్లో డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించాలంటూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలని అంబేద్కర్, పూలే అధ్యయన వేదిక నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం శాస్త్రీయ విధానాలు వ్యతిరేకించే ధోరణిలో ఉందని, మనువాద విధానాలను అవలంభించేలా, శాస్త్రీయతను కనుమరుగు చేసేలా నిర్ణయాలు తీసుకుంటుందని ఆరోపించారు. మనువాద తిరోగమన విధానాలను ప్రవేశపెట్టే చర్యలను, ప్రజలంతా వ్యతిరేఖించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంబేద్కర్, పూలే అధ్యయన వేదిక నాయకులు రంగు రాజేశం, ఎడ్ల కిష్టయ్య, పలిగిరి కనకరాజు, దేవి పోచన్న, వడ్డేపల్లి మనోహర్, సమ్మయ్య, ఇబ్రహీం, కైలాసం, సమ్మయ్య, దళిత బహుజన ప్రజాస్వామిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా గ్యాడ్యుయేషన్ డే

మందమర్రిరూరల్: పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో గల హైదరాబాద్ కృష్ణవేణి హైస్కూల్‌లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే ఉల్లాసంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ, యూకేజీ తరగతులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ రాం వేణు, సిబ్బంది అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గుణవతి, సిబ్బంది తిరుమల, బద్రి, శ్రీజ, జ్యోతి, శిరీష, షరీన, భవిత, విద్యార్థుల పేరెంట్స్ ఉన్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

తాండూర్: మండలంలోని మాదారం త్రీ ఇంక్‌లైన్ ఇతర గ్రామ పంచాయతీల్లో విచ్చలవిడిగా వెలిసిన అక్రమ లేఅవుట్లు, వెంచర్లపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామగొని మహీధర్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణదేవరాయలు, బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులు సుధీర్ గౌడ్, విష్ణుకళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

మందమర్రిరూరల్: టీపీసీసీ చీఫ్, ఎంపీ రేవంత్‌రెడ్డిపై బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ అనుచిత వ్యాక్యలు చేశారని ఆరోపిస్తూ పట్టణంలోని పాత బస్టాండ్ జయశంకర్ సర్ కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈటెల రాజేందర్ దిష్టి బొమ్మను దహనం చేశారు.